క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. గగన్‌పహాడ్ గ్రామం, సాతంరాయి, డ్రీమ్ అవెన్యూ, డ్రీమ్ మోనార్చ్, పాశంబండ, సాతంరాయి పారిశ్రామికవాడ, మీనాక్షి పేపర్ మిల్, డైమండ్ వెయింట్ బ్రిడ్జీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వెహికల్ అండర్‌పాస్‌కు అనువైన ప్రాంతం పరిశీలన



శంషాబాద్: పట్టణంలో బ్రిడ్జి కింద ఏర్పాటు చేసే వెహికల్ అండర్‌పాస్‌కు సరైన స్థలాన్ని ట్రాఫిక్ పోలీసులు మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్, నార్సింగి మార్కెట్ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, శంషాబాద్ జేఏసీ నేతలతో కలిసి శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ పి. శ్రీనివాస్ నాయుడు జాతీయరహదారిని పరిశీలించారు. ప్రస్తుతం ఫ్లైఓవర్ ముగుస్తున్న ప్రాంతం నుంచి నక్షత్ర వరకు ఉన్న ట్రాఫిక్ రద్దీ, దానిని సమన్వయ పర్చే అంశాలను పరిశీలించారు.

రైతులకు రుణాల పంపిణీ



శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు రుణాలను చైర్మన్ బి.దొనాకర్‌గౌడ్ పంపిణీ చేశారు. 9 మంది రైతులకు రూ.45, 13,650 స్వల్పకాలిక రుణాల చెక్కులను అందజేశారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ సూచించారు. సొసైటీ డైరెక్టర్లు మోహన్‌రావు, దేవేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బిక్యానాయక్, సీఈఓ యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ తేజస్విని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రఘురామిరెడ్డి, పరిశోధన సంస్థ అధికారులు, సిబ్బంది, ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యం అవసరం

'ఎస్కీ'లో అట్టహాసంగా 'యత్నిక్ డే'




విద్యార్థులతో డైరెక్టర్ రామేశ్వరరావు, సిబ్బంది

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అట్టహాసంగా 'యత్నిక్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు.గచ్చిబౌలిలోని ఎస్కీ ప్రాంగణంలోని చాణక్య భవనంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ వారుఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బిఎస్ కృష్ణప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వ్యాపార ప్రపంచంలో విజయం సాధించడానికి కమ్యూనికేషన్, కాంప్రహెన్షన్ చాలా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. చదువుతో పాటు నైపుణ్యాలను నేర్చుకోవడంపై విద్యార్థులు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యం ఉంటే రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, సోలో డ్యాన్స్, ర్యాంప్‌వాక్ అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి, కార్యక్రమంలో ఏ అండ్ పీ చీఫ్ లక్ష్మీకాంతరావు, విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక పోటీలు



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న అంతర్ కళాశాల క్రీడలలో భాగంగా మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, తదితర పోటీలు నిర్వహించారు.







కంటివెలుగు శిబిరం ప్రారంభం



మణికొండ: కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు చిత్రపురి కాలనీ హెచ్‌ఐజీలో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, కౌన్సిలర్ వి.హైమాంజలి అనిల్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ వసంతరావు, డాక్టర్‌లు మౌనిక, స్వామిత్రి, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రావు, ఎంపీహెచ్ యాదమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ఉపయోగించుకోవాలి

శంషాబాద్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని తొండుపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళ్లజబ్బులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. కౌన్సిలర్ రాణి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు స్థానిక బీఆర్ఎస్ నేతలు ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం కార్పొరేషన్ 20వ డివిజన్ కాళీకానగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు.



కాళీకానగర్‌లోని కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్

ఆడపిల్లలను ప్రోత్సహించాలి

మణికొండ: ఆడపిల్లలను ఉన్నతంగా చదివించి జీవితంలో రాణించేలా ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఉషారాణి, పత్తి ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం లక్ష్మమ్మ గుడి సమీపంలోని అయ్యప్ప భవన్‌లో మంగళవారం సీడీపీఓ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అన్ని రంగాలలో రాణించి తమ సత్తా చాటుతున్న మహిళలు సమాజంలో ఎంతో మంది ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ శారద, టీచర్‌లు, ఆయమ్మలు, మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్‌లు

బోరు పనులు ప్రారంభం



బోరు పనులను ప్రారంభించిన మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో స్థలాలు ఉన్న ప్రతి కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీహాళ్లతో ఆయా కాలనీలు, గ్రామాల వాసులకు మంచి సౌకర్యం కలుగుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మణికొండ జలమండలి కార్యాలయం పక్కన పాత గ్రామస్తుల కొరకు నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ వద్ద బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక కార్యక్రమాలతోపాటు చిన్న ఫంక్షన్‌లు చేసుకునేందుకు పలు కాలనీలలో కమ్యూనిటీహాల్‌లు ఉపయోగపడుతున్నాయన్నారు. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి కాలనీలో నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు జె.సిద్దప్ప, జె. లక్ష్మీరాములు, నాయకులు సి.బీరప్ప, బి.రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉద్యానవన విశ్వవిద్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు


ఉద్యానవన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ధర్నా

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో మంగళవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం ఈ పోస్టులు భర్తీ చేయాలని లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

ముగిసిన మల్లన్న జాతర

శంషాబాద్: పట్టణంలోని మెహిదిగార్డెన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న మల్లన్న జాతర మంగళవారం ముగిసింది. మూడురోజులుగా వైభవంగా పూజలు నిర్వహించారు. చివరిరోజు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక బోనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ ఆర్. గణేష్ గుప్తా, మాజీ ఎంపీటీసీ జ్ఞానేశ్వర్‌యాదవ్, చక్రధర్‌రెడ్డి, దయానంద్, మురళి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో ముఖ్యం

మైలార్‌దేవ్‌పల్లి: కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు గచ్చిబౌలి ఇన్ఫోసిస్‌లో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి, రంగారెడ్డి, నారాయణపేట, జిల్లాలకు చెందిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు సిరి, హారిక, సంజన హాజరై ప్రతిభ చూపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(50) మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన మేరకు.. బెంగళూరు జాతీయ రహదారిపై గండిగూడ వద్ద సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి ఆచూకీ వివరాలు తెలియరాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఆటో ఢీకొని మహిళ మృతి

శంషాబాద్ రూరల్ : బైక్‌ను ఆటో ఢీకొని భార్య మృతి చెందగా.. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని కవ్వగూడకు చెందిన ఎం.జంగయ్య, ఇస్తారమ్మ(38) దంపతులు సోమవారం సాయంత్రం శంషాబాద్-షాబాద్ రహదారిలో మల్కారం వైపు నుంచి కవ్వగూడకు బైక్‌పై వస్తున్నారు. సుల్తాన్‌పల్లి చౌరస్తా సమీపంలోకి రాగానే వీరి బైక్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా.. ఇస్తారమ్మ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ తైక్వాండో రెఫరీగా విష్ణు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ దర్గా ఖలీజ్‌ఖాన్ ప్రాంతానికి చెందిన జి.విష్ణు అంతర్జాతీయ రెఫరీగా ఎంపికయ్యారు. ఈ నెల 11,12 తేదీల్లో పాండిచ్చేరిలో జరగనున్న సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ అవకాశం ఇచ్చిన మాస్టర్ ఏ.ప్రవీణ్‌కుమార్, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ మాస్టర్ కిషోర్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కరాటేలో ప్రతిభ చూపిన సౌమ్య



సౌమ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నర్సింహయాదవ్

శంషాబాద్: సీఎం కేసీఆర్ కరాటే మూడో జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీవిజ్ఞాన్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని జి.సౌమ్య ప్రథమ బహుమతి పొందింది. ఈ మేరకు కళాశాలలో మంగళవారం విద్యార్థిని డైరెక్టర్, ప్రిన్సిపాల్ నర్సింహ యాదవ్ అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. అనంతరం విద్యార్థిని సన్మానించారు.

ఘనంగా డోలోత్సవం

శంషాబాద్ రూరల్: శ్రీరామనగరంలో కొనసాగుతున్న సమతా కుంభ్ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డోలోత్సవ దర్శనతో గృహదోషాలు తొలగిపోతాయని త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి అన్నారు. జీయర్, అర్చక స్వాములు పెరుమాళ్లకు ఊయలూపి డోలోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు భక్తులను ఎంతోగానో అలరించాయి.

గండిపేటలో సౌకర్యాలను కల్పిస్తాం

మణికొండ: గండిపేట పార్కు, చెరువును చూసేందుకు వచ్చే పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను మరింత పెంచుతామని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గండిపేటలో పర్యటించి అక్కడికి వచ్చిన పర్యాటకులను అడిగి అవసరమైన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్కు ప్రారంభ సమయంలో పక్కనే ఉన్న మరో 80 ఎకరాల పార్కును అభివృద్ధి చేస్తామని మంత్రి కేటీఆర్ హామి ఇచ్చారని, దాన్ని అభివృద్ధి చెందేలా చూడాలని స్థానిక మున్సిపల్ నాయకులు ప్రశాంత్‌యాదవ్, గోపాల గణేష్‌లు ఆయనకు తెలిపారు.





గండిపేట పార్కులో పర్యటించి సౌకర్యాల గురించి తెలుసుకున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు.

బండ్లగూడ: గండిపేట మండలం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సుధారాణి, కార్యదర్శి మీనా, సిఐటియూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్‌ల ఆధ్వర్యంలో మంగళవారం కిస్మత్‌పూర్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిస్మత్‌పూర్ సెక్టార్ అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు 44 మంది కార్మికులతో టీఆర్ఎస్‌కేవీ యూనియన్ నుంచి సిఐటియూలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఐటియూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. వారి హక్కుల సాధన కోసం ముందంజలో ఉండి పని చేస్తుందన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఓ భవనంలో లభ్యమైంది.ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై మౌనిక తెలిపిన మేరకు.. శివరాంపల్లి యూనివర్సిటీ కాలనీలో ఓ పాత భవనంలో గతంలో చెత్త గోదాముగా వినియోగించేవారు. దీనిని యజమాని కొన్ని నెలల క్రితం ఖాళీ చేయించాడు. అప్పటి నుంచి భవనం ఖాళీగా ఉంది. కొన్ని రోజుల క్రితం స్థానికంగా 30-35 సంవత్సరాల వ్యక్తి రాత్రి సమయంలో ఈ భవనంలోకి వెళ్లి ఉండే వాడు. స్థానికులు గమనించి మతిస్థిమితం లేకపోవడంతో యజమానికి తెలిపారు. రెండు, మూడుసార్లు యజమాని ఆ యువకుడిని ఇంట్లో నుంచి పంపించివేశాడు. వారం రోజుల క్రితం తిరిగి రాత్రి గోడదూకి ఇంట్లోకి వెళ్లాడు. రెండు రోజులుగా ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పరిశీలించగా కాలిన స్థితిలో మృతదేహం కనిపించింది. దీంతో పంచనామా నిర్వహించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. చలి నుంచి రక్షణకు మంట పెట్టి ఉండవచ్చునని అది కాస్తా అంటుకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం అసలు విషయాలు తెలుస్తాయని ఎస్సై మౌనిక తెలిపారు.

55 ఏళ్ల తరువాత అపూర్వ కలయిక

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ చదువుకున్న 1968 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 55 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ కల్చరల్ సెంటర్ (క్లబ్)లో సందడిచేశారు. ఇన్ని సంవత్సరాల తరువాత కలుసుకున్నవారు ఒక్కరిని ఒకరు గుర్తుపట్టలేకపోయారు. రిట్రైర్డ్ వైస్ ఛాన్సలర్, కలెక్టర్, ప్రొఫెసర్స్, అడిషనల్ డైరెక్టర్స్‌గా పరిచయం చేసుకున్నారు. వీరిలో కొందరు బ్యాచ్‌మెంట్స్ మృతి చెందిన వారి పేర్లు చదవి వారిని జ్ఞాపకం చేసుకొని వారికి మౌనం పాటించి నివాళులర్పించారు. ఇప్పటి నుంచి ప్రతి 6నెలలకు ఒకసారి సమావేశమవ్వాలని ప్రతి ఒక్కరి కష్టసుఖాలను తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌డీ శిఖామణి, యస్ సుబ్బారావు, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాద వితరణలో దాతలు భాగస్వాములు కావాలి

రాజేంద్రనగర్: శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి దాతల సహకారం అవసరమని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి శనివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు 2 గంటల వరకు సాగుతుంది. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు. దేవాలయంలో నిరంతరాయంగా శాశ్వతముగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు భక్తుల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. దాతలు 9347334437, 9000300023 నెంబర్లకు ఫోన్‌చేయాలన్నారు.